ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం



ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామికి ప్రశంసా పత్రం అందజేస్తున్న సీపీ సి.వి ఆనంద్

గౌలిపురా: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామికి సీపీ సి.వి ఆనంద్ శుక్రవారం మెమొంటో, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఇక ముందు కూడా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎస్సైలు, సిబ్బంది కూడా ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సౌత్, ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ శుక్రవారం వార్షిక ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్, ఎస్సైలు వెంకటప్ప, సుబ్రహ్మణ్యం, జనార్దన్ నాయుడు, కార్తీక్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



క్రీడా సామగ్రి అందజేస్తున్న సుధాకర్‌రావు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని జిల్లా క్రీడా అధికారి సుధాకర్‌రావు సూచించారు. జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో యూబీఎస్ అథ్లెటిక్స్ కిడ్స్ కప్ స్కూల్స్ స్పోర్ట్స్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 7–15 ఏళ్ల వయస్సు గల విద్యార్థులకు శిక్షణ కేంద్రాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారామ్, అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు జగన్మోహన్ గౌడ్, నేహా తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు



రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావుతో శశిధర్, సభ్యులు

అఫ్జల్‌గంజ్: హైదరాబాద్ గణేశ్ ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్ రావినూతల శశిధర్‌తో పాటు ఇతర కమిటీ సభ్యులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శశిధర్‌తో పాటు సభ్యులు మెట్టు వైకుంఠం, ఆల భాస్కర్, బుచ్చిరెడ్డి, మైపాల్‌రెడ్డి, శ్రీరామ్ వ్యాస్, సంజయ్ ఘనాటేలను ఆయన అభినందించారు. అనంతరం రాంచంద్రరావు మాట్లాడుతూ.. ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు భాగ్యనగరంలో జరిగే గణేశ్ ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించాలని నూతన కమిటీకి సూచించారు.

'నైమిష ఆంగ్ల' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత మానుగగ్ర శేషాచల పతిరావు రచించిన నైమిష ఆంగ్ల పుస్తకావిష్కరణ సభను రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. మహాభారతం నుంచి నేటి వరకు దైవం, ప్రకృతులకు సంబంధించిన అనేక విషయాలను రచయిత చాలా చక్కగా వివరించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ పూర్వ చీఫ్ కమిషనర్ రాయసం వెంకటరామయ్య, యూనియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్, కే భాస్కర్‌రావు, సాహితీవేత్త టీ రాజగోపబాలం, ఆంధ్రాబ్యాంక్ పూర్వ జనరల్ మేనేజర్ వీ వెంకటకృష్ణమూర్తి, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతాలు

శ్రావణ శుక్రవారం సందర్భంగా అబిడ్స్, చార్మినార్, మెహదీపట్నం డివిజన్లలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో వ్రతాలను ఆచరించారు. అలాగే అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. – అబిడ్స్, చార్మినార్, మెహదీపట్నం జోన్ల బృందం



కార్వాన్ శిశుమందిర్ పాఠశాలలో..



లక్ష్మీదేవీ రూపంలో మీరాలంమండి మహంకాళేశ్వర అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పూజల్లో చైర్మన్ గొడుగు ఆంజనేయులు ముదిరాజ్



సంజయ్‌నగర్ నల్లపోచమ్మ గుడిలో ..

'ఆద్య కళ'ను పరిరక్షించాలి

అంతర్జాతీయ మూలవాసీ దినోత్సవంలో రాష్ట్ర మంత్రి సీతక్క



ఆద్య కళాకారులతో మంత్రి సీతక్క, జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి

నాంపల్లి: ఆద్య కళ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని తెలుగు వర్శిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో అంతర్జాతీయ మూలవాసీ దినోత్సవ వేడుకలను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మూలవాసీ ఉరుములు–మెరుపులు' శీర్షికన ప్రత్యేక సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఆమె హాజరై సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. ఆద్య కళలను భావితరాలకు అందించడానికి ఆచార్య జయధీర్ తిరుమలరావు చేస్తున్న కృషిని అభినందించారు. తిరుమలరావు సేకరించిన ఆదివాసీ వస్తువులను ప్రదర్శించేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలనే ప్రతిపాదన వచ్చిందని, సహచర మంత్రులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. అలాగే ఆదివాసీ కళాకారులకు ఇంటి స్థలాలను కేటాయించేందుకు కలెక్టర్లతో మాట్లాడి న్యాయం చేస్తానని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆదివాసీ కళా ఖండాల్లు, సంపదను కాపాడాల్సినబాధ్యత ప్రభుత్వంపై కూడా ఉందన్నారు. తిరుమలరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో కళాకారుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయకారుడు జయరాజ్, సుధాకర్, విమలక్క, పృథ్వీరాజ్, పసునూరి రవీందర్, భూపతి వెంకటేశ్వర్లు, అపర్ణ తోట తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించే కర్మాగారాలుగా మారాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు పతకాలు సాధించే కర్మాగారాలుగా మారాలని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఎల్బీ స్టేడియంలో వివిధ క్రీడా పాఠశాలలు, అకాడమీల పనితీరు, సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికపై అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి గాను పారదర్శకంగా, ప్రతిభా ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయాలన్నారు. హకీంపేటలో తక్షణ మరమ్మతులు, అన్ని క్రీడా పాఠశాలల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతిభా ఆధారంగా విద్యార్థులను వర్గీకరించి క్రీడా ప్రతిభా లేని విద్యార్థులను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు బదిలీ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎల్బీస్టేడియంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్, క్రీడా పాఠశాలలో విజిటర్స్ హాల్స్ నిర్మాణం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి, క్రీడాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నృత్యాల ప్రదర్శన అభినందనీయం



గన్‌ఫౌండ్రీ: ఒకే వేదికపై వివిధ రాష్ట్రాల నృత్యాలు ప్రదర్శించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలో సింగిడి సాంస్కృతిక సంస్థ 3వ 'నృత్యాంగణ' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోల్‌కత్తా, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దుబాయ్, కెనడా దేశాలకు చెందిన కళాకారులు తమ నృత్యాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పర్యాటక, సాంస్కృతిక రంగాల అభ్యున్నతికి కృషి చేస్తున్నాదన్నారు. అనంతరం నాట్య గురువులు కిరణ్మయి బోనాల, రమణి సిద్ధి, కే విజయలక్ష్మికి రాజీవ్ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, స్విట్జర్లాండ్ ఇండియన్ అసోసియేషన్ కార్యదర్శి వేదాంతం కిరణ్, సింగిడి సాంస్కృతిక సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు సుందర ఉపాసన, ప్రణవి చింతలపుడి (దుబాయ్), మేరి ఇలాం గోవాన్ (కెనడా), త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఇందిరా పరసరం, సింగిడి సంస్థ అధ్యక్షుడు డీఆర్‌కే విశ్వకర్మ తదితరులు పాల్గొన్నారు.



'ప్రజలకే నా జీవితం అంకితం'



దేవర శ్రీనివాస్‌కు పుస్తకాన్ని ఇస్తున్న దత్తాత్రేయ

గోల్కొండ: ప్రజలతో తనకు ఉన్న అనుబంధాలను పుస్తక రూపంలో ఇచ్చానని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ తన ఆత్మకథ పుస్తకాన్ని ఆయనకు అందించారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి



గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ చౌరస్తా పూలే విగ్రహం వద్ద పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాయన్న స్ఫూర్తితో ముదిరాజ్ సోదరులంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు పాటుపడాలని బండారి వెంకటేశ్‌ముదిరాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్వాన్ ముదిరాజ్ సంఘం నాయకులు, ముదిరాజ్ సోదరులు పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో క్యాట్ కంట్రీ ప్రారంభం



గోల్కొండ: షేక్‌పేట్‌లో క్యాట్ థెరపీ సెంటర్ క్యాట్ కంట్రీని తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ కార్యదర్శి జయేష్‌రంజాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ పశు వైద్యాధికారి మహ్మద్ యాకుబ్‌షరీఫ్ ఏర్పాటు చేసిన ఈ కేంద్రం త్వరలోనే సందర్శకుల కేంద్రంగా మారుతుందన్నారు. పిల్లులపెంపకంతో ఒత్తిడి దూరమై మానసికోల్లాసం కలుగుతుందన్నారు.

గంజాయి పట్టివేత



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

అబిడ్స్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధూల్‌పేట్ నుంచి కార్వాన్ మీదుగా ధన్‌రాజ్ అనే వ్యక్తి గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారి అంజిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. దాదాపు 2 కిలోల గంజాయితో పాటు రూ.లక్షా 50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడితో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూసీ పరీవాహక ప్రజల తరలింపు



ఎంజే బ్రిడ్జి మూసీ ఒడ్డున స్థానికుడితో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

అబిడ్స్: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలు నిండుకుండలా మారాయి. దీంతో వాటర్‌బోర్డు అధికారులు ఏ క్షణమైన మూసీలోకి నీటిని వదిలే అవకాశం ఉండడంతో గోషామహల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఎస్‌ఐలు అరుణోదయ, లక్ష్మయ్య, రాజు, ఇతర సిబ్బందితో కలిసి గురువారం మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించారు. ఎంజే బ్రిడ్జి నుంచి పురానాపూల్ వరకు మూసీ ఒడ్డున నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ముందు జాగ్రత్త చర్యగా స్థానిక ప్రాంతాల్లోని కమ్యూనిటీ హాల్‌లు, ఇతర పెద పెద్ద ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఇందుకోసం ఇతర శాఖల అధికారులతో కలిసి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా స్వరాబ్జి పోచ్ ఖానావాలా జయంతి



స్వరాబ్జి పోచ్ ఖానా వాలా విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

సుల్తాన్‌బజార్: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు స్వరాబ్జి పోచ్ ఖానావాలా జయంతి వేడుకలను కోఠిలోని రీజినల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ రీజినల్ హెడ్ దిలీప్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్వరాబ్జి పోచ్ ఖానావాలా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వరాబ్జి పోచ్ ఖానావాలా 1911లో ముంబైలో మొదటి శాఖను ప్రారంభించారన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 4500 శాఖలు ఉండగా 8 కోట్ల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా 2025 మార్చి నాటికి రూ.7.5 లక్షల కోట్ల లావాదేవీలను నిర్వహించిందని, 2026 మార్చి 31కి రూ.8.25 లక్షల కోట్ల లావాదేవీలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ విప్లవ్‌దేవ్, చీఫ్ ఇంటర్నల్ ఆడిటర్ సురేశ్, దేవేంద్ర, జోనల్ ఆఫీస్ ఏజీఎం కనకరాజు, అభిజిత్, గుల్షన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గౌలిపురా: హనుమాన్‌నగర్ జ్ఞాన భారతి స్కూల్ వద్ద రూ.5.90 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గౌలిపురా కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో గౌలిపురా ఏఈ తేజోవంత్, బస్తీవాసులు వెంకటేశం, బీ చంద్రమోహన్, సాయి, గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఈ సుమన్ కుమార్ ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు జీ రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కే రాజ్ కుమార్, ఏ మహేందర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి హోమం పూజలు



పూజల్లో గాజుల అంజయ్య–చంద్రకళ దంపతులు తదితరులు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో దేవాలయంలో శుక్రవారం ధన్వంతరి హోమం పూజలు నిర్వహించారు. పాతబస్తీతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు పలువురు అధికార, అనధికార ప్రముఖులు సైతం తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢ బోనాల వేడుకల్లో భాగంగా గత నెల 21న ఆలయంలో జరిగిన రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపిస్తూ..ధన్వంతరి పూజలు నిర్వహించాలని సూచించిన మేరకు పూజలు చేశామని ఆయన తెలిపారు.

అఖిలేష్‌యాదవ్‌ను కలిసిన నాయకులు



అఖిలేష్ యాదవ్‌తో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, సతీశ్

అబిడ్స్: సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్‌తో కలిసి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ బిల్లుకు మద్దతు తెలపడంపై కృతజ్ఞతలు తెలపడంతో పాటు బీసీ బిల్లు సాధనకు కూడా పార్లమెంట్‌లో మాట్లాడాలని కోరారు. అఖిలేష్ యాదవ్ స్పందిస్తూ.. దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ ఏ మాత్రం చిత్త శుద్ధి ఉన్నా బిల్లుకు మద్దతు తెలపాలన్నారు. పార్లమెంట్‌లో కూడా ఈ అంశాన్ని లేవనెత్తి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని హామీనిచ్చారు.

యుద్ధ ప్రతిపాదికన సహాయక చర్యలు



టోలిచౌకీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: యుద్ధ ప్రతిపాదికన సహాయక చర్యలు చేపడుతున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ నదీమ్‌కాలనీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిలిచిన వరదను పరిశీలించారు. బల్దియా మాన్సూన్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, బల్దియా అధికారులు ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



జి.పుల్లారెడ్డి ఫార్మసీ కళాశాల స్నాతకోత్సవ దినోత్సవం సందర్భంగా ఫార్మ్ డి డిగ్రీని ఐపీఎస్, తెలంగాణ పోలీస్ అకాడమీ హైదరాబాద్ డైరెక్టర్ అభిలాష బిష్త్ చేతులమీదుగా పట్టా అందుకుంటున్న రహీలా ముస్కాన్.